క్లుప్తంగా

మండల స్థాయి వ్యాసరచన పోటీలు



దామరగిద్ద: ప్రజా పాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు జీఎచ్‌ఎం అశోక్ సమక్షంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పునరుత్పాదక శక్తి వనరులు అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, కనకప్ప, రవికుమార్, శంకర్ సీఆర్‌పీ మహిపాల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మద్దూరు: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ దీప్తి తెలియజేశారు. గురువారం మద్దూరు బాలికల ఉన్నత పాఠశాలలో వెనుకబడిన అభివృద్ధి శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు అందరూ పాటిస్తే ప్రమాదాలు చాలా వరకు నియంత్రించొచ్చన్నారు. వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు రోడ్డు క్రాస్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను చిత్రపటాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహారెడ్డి, హాస్టల్ వార్డెన్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ



దామరగిద్ద: బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్‌ను గురువారం మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఉల్లిగుండం మాజీ ఎంపీటీసీ కిషన్‌రావ్ మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసేలా జరుపుకునే దీక్ష దివస్ సందర్భంగా ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర చిరుతిళ్లతో అనారోగ్యం

కోస్గి రూరల్: ఆరు బయట అపరిశుభ్ర పరిస్థితుల్లో విక్రయించే చిరుతిళ్లు తిని అనారోగ్యం బారిన పడొద్దని సైన్స్ టీచర్ వార్ల మల్లేశం అన్నారు. గురువారం మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో అపరిశుభ్ర చిరుతిళ్లతో అనారోగ్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకర్షించే రంగులతో అందమైన అలంకరణలతో విక్రయించే తినుబండారాలు మంచివి కాదన్నారు. గింజలు, .ధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, కాయగూరలతో ఇంటి దగ్గరనే తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని సూచించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై వీడియో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు సిద్రాములు, త్రిగుణకరశాస్త్రి, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

గొర్రెలు చోరీ.. కేసు నమోదు

కోస్గి రూరల్: ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన దొడ్డిలో గొర్రెలు చోరీ అయిన సంఘటన గురువారం మండల పరిధిలోని నాచారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాలు.. నాచారం గ్రామానికి చెందిన బడుసు బాలయ్య ఈనెల 26న గొర్రెలను ఇంటి సమీపంలోని దొడ్డిలో నిలిపాడు. మందలో గొర్రెలు తక్కువగా కనిపించడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై బాల్‌రాజ్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నారాయణపేట రూరల్: మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై నారాయణపేట పోలీసులు దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,540 నగదు, 6 సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మరికల్ కేజీబీవీ పాఠశాలలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జమీల్



మనిపూర్‌తండాలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాయి ప్రకాష్

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆనంద్, మండల విద్యాధికారి అంజనేయులు బియ్యం నిల్వలు పరిశీలించారు. వంట గది, పరిసర ప్రాంతాలు పరిశీలించి ఏజెన్సీ మహిళలకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరికల్: కేజీబీవీ పాఠశాల్లో విద్యార్థులకు సంబంధించిన మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ జమీల్, ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డి పరిశీలించారు. వంటగదితో పాటు బియ్యం తదితర వంట సరుకులు, నిల్వ ఉన్న గదిని తనిఖీ చేశారు. భోజనం విషయంలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని మనిపూర్‌తండా ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీడీవో సాయి ప్రకాష్ తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం రామకిష్టాయిపల్లి, కిష్టాపూర్ గ్రామాలలో మధ్యహ్న భోజనంను పరిశిలించారు. ఇందులో సీఆర్‌పీ నారాయణ, ఉపాధ్యాయురాలు సునిత పాల్గొన్నారు.

మద్దూరు: విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని బీసీ సంక్షేమాధికారి అబ్దుల్ ఖలీల్ హాస్టల్ సిబ్బందికి ఆదేశించారు. గురువారం మద్దూరులోని బాలికల బీసీ సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హస్టల్‌లో బియ్యం నిల్వలు పరిశీలించారు. నాణ్యమైన, పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని హాస్టల్ వార్డెన్ జ్యోతి సూచించారు. అనంతరం విద్యార్థులలో హాస్టల్ వసతి, భోజనం తదితరల విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆడపడుచుల ఆరాధ్య దైవం నాభిశిల

మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



లోకూర్తి బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: గ్రామ బొడ్రాయి ఆడపడుచుల ఆరాధ్య దైవమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లోకూర్తి గ్రామంలో నాభిశిలా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆడపడుచుల సమక్షంలో నాభిశిలా (బొడ్రాయి) స్థాపన మైసమ్మ, వినాయక నాగప్రతిష్ఠ, నవగ్రాహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. మండలంలోని చాకలోన్‌పల్లిలోనూ బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ సీఈఓ జ్యోతి

కృష్ణా: ప్రతి విద్యార్థికి ఓటరు నమోదుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మనిషికి కల్పించిన మహోత్తరమైన ఓటు హక్కు, దాని ఆవశ్యకతపై వివరించారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌లిస్టులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జానయ్య, ఎస్‌ఓ శాలిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

‘సీఎంను విమర్శించే స్థాయి కాదు’



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య సాగర్

నర్వ: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు రాజుల ఆశిరెడ్డిది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కాదని, స్థాయి మించి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు జలంధర్‌రెడ్డి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొడంగల్, నారాయణపేట సాగునీటి ప్రాజెక్టుపై ఎలాంటి అవగాహన లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతి ఇస్తే కాంగ్రెస్ పార్టీగా ఆనాడు పోరాటం చేస్తే మాపై కేసులు పెట్టారన్నారు. నేడు వారే ఫ్యాక్టరీల ఏర్పాటుపై ధర్నాలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మండల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుంటే చూసి ఓర్వలేక నిందలు వేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం నర్వ మండలాన్ని తీవ్రంగా వెనకబాటుకు గురి చేసిందని దీనిపై ఎలాంటి చర్చకైన సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, శరణప్ప, రవీందర్‌రెడ్డి, సంజీవారెడ్డి, అయ్యన్న, గడ్డం నర్సిములు, సుదర్శన్‌గౌడ్, రాయిచూర్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ఖండిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: అక్రమ అరెస్టులు ఖండిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు బాను అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకు విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మాగనూరు, నారాయణపేట, మద్దూరు, దామరగిద్ద, నర్వ, మండలాలకు చెందిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వెలుగు చూస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరిపించాలని.. ఘటనకు కారకులైన వారిని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శిరీష, వెంకటమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు తనిఖీ చేసిన ఆర్డీఓ



తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రాంచందర్‌నాయక్

మక్తల్: మాగనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని దుకాణ సముదాయాల్లో నారాయణపేట ఆర్డీఓ రాంచందర్ నాయక్ తనిఖీలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో వీటిపై తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ రహిమాత్ తదితరలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, శుక్రవారం మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్ రామ్ కోరారు. గురువారం జిల్లా విద్యాధికారి, నారాయణపేట మండల విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు యాదమ్మ, జ్యోతి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కడప పూజ



కడప స్థాపన పూజలో పాల్గొన్న మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు

దామరగిద్ద: మండల కేంద్రంలో షిర్డీ సాయి మందిరం నిర్మాణంలో భాగంగా గురువారం ఆలయ ప్రధాన ముఖద్వారం గడపను ప్రతిష్ఠించి కడప పూజను గ్రామ మాజీ సర్పంచ్ వన్నాడ ఆశమ్మ, అంజప్ప దంపతులు నిర్వహించారు. సాయిబాబ భక్తుడు దామరగిద్దకు చెందిన వన్నాడ బొంబాయి వెంకటప్ప, విజయలక్ష్మీ దంపతులు తమ సొంత వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన షిర్డీ సాయి మందిర నిర్మాణం రాతికట్టడంతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి వన్నడ చంద్రకాంత్ మాట్లాడుతూ.. సాయినాథుని ఆలయం దామరగిద్దలో నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆశమ్మ అంజయ్య, మాజీ ఎంపీపీ నర్సప్ప, వన్నడ చంద్రశేఖర్, బస్సప్ప, పోలీస్ వెంకటప్ప, నీలి వెంకట్రాములు, వన్నాడ సత్యనారాయణ, శ్రీనివాస్, భీంషప్ప, రవీంద్రనాథ్, గోపాల్‌రావ్, శ్రీనివాస్, వెంకటప్ప, ఖాజా పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

మాగనూర్: మండల నూతన ఎంఈఓగా నియమితులైన అనిల్‌గౌడ్‌ను మండల పీఆర్టీయూ టీఎస్ సంఘం నాయకులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పాఠశాలలను విద్యాపరంగా పటిష్టపరుస్తూ, సవ్యంగా పాఠశాల నడిచే విధంగా మండలంలో ప్రతి ఉపాధ్యాయుడు పనిచేయాలని, టీచర్ సపోర్టెడ్ పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన విషయంలో ప్రతి పాఠశాలలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బలరాం, తిమ్మన్న, రాజిరెడ్డి, శ్రీకాంత్, సీఆర్పీలు ఎల్లాగౌడ్, కృష్ణయ్య, స్వప్న, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

నారాయణపేట టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు చేయాలని జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు హాజీమాలంగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సర్వేల పేరుతో కాలం వెళ్లదీస్తుందన్నారు. వ్యవసాయ కూలీలకు ప్రకటించిన జీవన భృతి రూ. 12 వేలు వెంటనే ప్రకటించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాములు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి

నారాయణపేట: తెలంగాణ ఉర్దూ వాకింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల స్థాయిలో ఉర్దూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జిల్లా అక్రిడిటేషన్ కమిటీల్లో యూనియన్ ప్రతినిధిని చేర్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ఊట్కూరులో తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం బ్యాంకులు, శ్రీనిధి ద్వారా రుణాలు అందిస్తుందన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు వివిధ పథకాలను మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏపీడీ మొగులప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తహసీల్దార్ రవి, ఏపీఎం నిర్మల, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా సఖి కేంద్ర నిర్వహుకులు క్రాంతిరేఖ

మరికల్: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను అరికట్టెందుకు మహిళలు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా సఖి కేంద్ర నిర్వహుకులు క్రాంతి రేఖ, షీటీం బాలరాజ్ అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సఖి కేంద్రం, షీటీం ఆధ్వర్యంలో అంతర్జాతీయంగా మహిళలపై హింసా నిర్మూలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక అంబేద్కర్ భవనంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక మార్పు, లింగ వివక్షలేని సమాజం కోసం తల్లిదండ్రులు తప్పనిసరిగా లింగ భేదం లేకుండా చదివించాలన్నారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ రమాదేవి, సోషల్ కౌన్సిలర్ రమాదేవి, హెల్త్ వర్కర్లు మంగమ్మ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ అమలు చేయాలని ప్రగతి శీల వ్యవసాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ జయరాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు తాయప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. కూలీలను గుర్తించి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, మహేష్, సాయికుమార్, మధు, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్

కృష్ణా: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని ముడుమాల్ గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు విశాలి, కావేరి, శిరీష, అనిత, అర్చన, అరవింద్ కు రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రిటైర్డ్ పీఈటీ గోపాలం, ఎంఈఓ నిజాముద్దీన్ వారికి ప్రశంసాపత్రాలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్‌లో పశ్చిమబెంగాల్‌లో జరిగే పోటీల్లో అర్చన పాల్గొంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ మీనకుమారి, ఉపాధ్యాయులు కుర్మయ్య, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్, మాధవి, రమేష్, గాయిత్రి, తిమ్మప్ప పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం జీవనభృతి రూ.12 వేలు అందించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకుడు సలీం డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కూలీలు, కార్మికులు కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ కూలీలకు రూ.12 వేల జీవనభృతి ఇస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పని దొరకక పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఏడాది సంబరాలు నిర్వహిస్తున్న సమయంలో వ్యవసాయ కూలీలకు జీవన భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నప్ప, మల్లేష్, బాలు, కృష్ణ, రఫియాబేగం తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాలపై కళాజాతా



మక్తల్‌లో కళాజాత బృందం ప్రదర్శన

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకుని కళాకారుల ప్రదర్శన కార్యక్రమం మక్తల్ మండలం జక్లేర్, మంతన్‌గో, మక్తల్ గ్రామాల్లో కళాజాతా బృందం ప్రదర్శనలు చేపట్టారు. ఆరు గ్యారెంటీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతులకు బోనస్ తదితర పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: ప్రజా పాలన విజయోత్సవాలపై జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి రషీద్ ఆధ్వర్యంలో గురువారం మాగనూర్ మండల కేంద్రంతో పాటు వడ్వాట్ గ్రామంలో కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, 6 గ్యారంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రవిశంకర్, కిరణ్, నర్సింహ, బాలయ్య, లక్ష్మీ, రాధ, జ్యోతి, సుగుణ, జహీర తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త జ్యోతిబాపూలే



ఊట్కూరులో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్వ: సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, బడుగు బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని బీసీ సంఘం అధ్యక్షుడు సుధీర్ అన్నారు. గురువారం జ్యోతిబాపూలే 134వ వర్ధంతిని పురస్కరించుకొని నర్వ బీసీ సంఘం భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుధీర్, ఐలప్పయాదవ్, గడ్డం నర్సిములు, ఖలీల్ అహ్మద్, వెంకటయ్య, డా.శంకర్, ఆంజనేయులు, ఆటో రఫీ, ఆటో వెంకటయ్య పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, కృష్ణ, పోన్నయ్య, రాము, ప్రకాష్, చిన్నయ్య, సాయిలు పాల్గొన్నారు.

కోస్గి: సంఘసంస్కర్త, సత్యశోధనను ఏర్పాటు చేసి మహిళ విద్యను ప్రోత్సహించిన జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎండీడీఓ శ్రీధర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు బస్వరాజ్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాములు, పోషప్ప ఉన్నారు.

ఊట్కూరు: అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొక్కు శంకర్, నారాయణ, హాజమ్మ, శ్రీనివాస్, భరత్, దశరథ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.